# పెళ్ళి

**ఉద్యోగరీత్యా** ఉన్న ఊరు విడిచిపెట్టి పదిహేనేళ్ళవుతోంది. ఉన్నట్లుండి పుట్టి పెరిగిన గడ్డమీదకు మనసు మళ్ళింది. నాకక్కడ ఇల్లు వాకిలి లాంటివేవీ లేకపోయినప్పటికీ ఆ పరిసరాల్నీ, పరిచయస్థుల్నీ చూడాలనిపించి బ్యాగు సర్దుకున్నాను.

కాంప్లెక్సులో అడుగు పెట్టేసరికి ఎక్కబోయే బస్సు బయలుదేరడానికి సిద్ధంగా ఉంది.

బ్యాగు జారిపోతూ ఉంటే భుజం మీద కెగదోసుకుంటూ బస్సెక్కాను.

మెల్లగా బయలుదేరిన బస్సు స్పీడందుకుంది.

నా ఆలోచనలు అంతకంటే వేగాన్ని పుంజుకున్నాయి.

★ ★ ★

'సదూ ఐపోనాదా బాబూ?'

సుపరిచిత కంఠం కర్ణభేరిని స్పృశించడంతో ఠక్కున తలెత్తి చూశాను.

సాంబయ్య... రోజూ మాకు పాలుపోసే సాంబయ్య...

వాడు మా ఇంటి వెనుక కమ్మలింట్లో ఉంటున్నాడు. వాడి ముంగిట్లో ఎప్పుడూ మూడు నాలుగు గేదెలుంటాయి. అవే అతడి ఆస్తిపాస్తులు. వాటిని మేపుకుని పాలు పిండి పదిమందికి పంచుతూ సంసారాన్ని నెట్టుకొస్తున్నాడు. పాపం వాడిది గంపెడు సంసారం. ఆదాయం చాలక అప్పులు చేయడం, అవి తీర్చలేక తిప్పలు పడటం అతడికి మామూలే.

'నా చదువు మాటకేం గాని నువ్వు రోజూ పాలకు బదులు నీళ్ళు పోసేస్తున్నావట' ఊరికే ఉడికించడానికలా అన్నాను.

'పొండి బాబు, తమరెప్పుడూ అట్టాగే అంటుంటారు. సెప్పొచ్చేదేటంటే మా కడదానికి సంబంధం కుదిరిందయ్యా''

'ఏమిటీ సీతాలుకు పెళ్ళా?

ఆశ్చర్యపోయాన్నేను.

'ఔను బాబు'

'ఏంటి సాంబయ్యా పట్టుమని పన్నెండేళ్ళయినా నిండని సీతాలుకు పెళ్ళి చేసేస్తున్నావా? నీకేమైనా మతి పోయిందా? శారీరకంగా, మానసికంగా ఎదగని పిల్లలకు పెళ్లిళ్లు చేస్తే ముందుముందు వాళ్ళ సంసారాలు సజావుగా సాగుతాయంటావా?

'నా కవన్నీ తెలవదు బాబు. మన గ్రామాలంట ఇట్టాంటివి మామూలే. నాకు గెడ్డం మీసం రాకముందే మా అయ్య నా చేత తాళి కట్టించేసినాడు'

అదేమన్నా ఘనకార్య మనుకుంటూన్నావా? పసి తనంలో పెళ్ళి చేసుకుని నువ్వేం సుఖపడిపోతున్నావ్? అన్నాను అతను చేసిన పనికి అయిష్టాన్ని వ్యక్తం చేస్తూ.

మరి మాట్లాడలేదు సాంబయ్య.

పల్లెలో ఆడపిల్ల అనగానే పెళ్ళికి ఎందుకంత తొందర పడతారో బోధపడ్డంలేదు.

అతడన్నట్లే వారం తిరక్కుండానే సీతాలుకు పెళ్ళయిపోయింది.

బుల్లెమ్మను, బుల్లోడినీ దీవించమని తీసుకొచ్చాడు.

పెళ్ళికొడుక్కీ పదిహేనేళ్ళు కూడా ఉంటాయో ఉండవో, సీతాలులాగే సన్నగా రివట్లా ఉన్నాడు. పెళ్ళి కూతురి వేషంలో ఉన్న సీతాల్ని చూస్తే జాలివేసింది.

★ ★ ★

ఏదో ఊర్లో బస్సు ఆగడంతో నా ఆలోచనలకు అంతరాయమేర్పడింది.

టీ త్రాగేందుకు కాబోలు డ్రైవరు, కండక్టరు బస్సు దిగేరు.

'అమ్మా చూడాలి... నిన్ను నాన్నను చూడాలి... నాన్నకు ముద్దు ఇవ్వాలి... నీ వొడిలో నిద్దురపోవాలి. అమ్మా...' అని పాడుతూ బస్సెక్కిందో అమ్మాయి. చిరిగిన జాకెట్టు, అతుకుల పరికిణీలో ఎంతో దీనంగా ఉంది. లోతుకు పోయిన ఆ పిల్ల కళ్ళు రెండ్రోజులై తిండి లేదని చెబుతున్నాయి. మనిషి అర్భకంగా ఉన్నా కంఠం మాత్రం ఖంగుమంటోంది.

ప్రయాణీకులంతా తలో అర్ధా పావలా వేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు.

వెల కట్టలేని కళ ఆమెది.

పర్సులోంచి పది కాగితం తీసి ఆమెజోలెలో వేశాను. ఆ అమ్మాయి నా వంక ఆశ్చర్యంగా చూసి బస్సు దిగిపోయింది. ఎలమంచిలి చేరేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయింది. సూర్యుడు ఆకాశం మధ్యకొచ్చి నిప్పులు చెరుగుతున్నాడు.

గుక్కెడు సోడా నీళ్ళతో దప్పిక తీర్చుకుని బయలుదేరాను.

'ఎక్కడికి బాబూ' ఓ పసివాడి ప్రశ్న. 'దిమిలి'

'ఆ జంక్షన్ కాడ బస్సు ఆగుద్ది రండి' అంటూ నా బ్యాగు పుచ్చుకున్నాడు.

దిమిలికి ఇప్పుడు బస్సులు పడ్డాయన్నమాట' అనుకుంటూ వాడి చేతిలోని బ్యాగు తీసుకోబోయాను.

'నన్ను పట్టుకోనివ్వండి సార్. మీకేం తోస్తే అదివ్వండి' వాడి చూపులో జాలి. మోములో దీనత్వం.

సరే పదమన్నాను. నేను ముందు వాడు వెనుక నడుచుకుంటూ వెళుతున్నాం.

త్రోవలో నలుగురు వ్యక్తులు కలిసి ఓ పసివాడిని చావబాదుతున్న దృశ్యం కంటబడింది.

'అమ్మోయ్... బాబోయ్...' అంటూ గోలపెడుతున్నాడు పిల్లవాడు.

చుట్టూ జనం చేరారు. ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

ఆ అకృత్యానికి మనసు చలించి పోయింది. చూస్తున్న వాళ్ళు మనుషులా? రాక్షసులా అనిపించింది.

'ఆ పసివాడి నెందుకలా కొడుతున్నారు?' అని అడిగాను ఉండలేక.

'వీడు పిల్లాడని కనికరించకండి. దొంగ వెధవ. మావాడి జేబు కొట్టాలని ప్రయత్నించాడు దొరికిపోయాడు'

'మీ డబ్బేమీ పోలేదు కదా. ఇక వాడిని విడిచిపెట్టండి. మరోనాలుగు దెబ్బలు పడితే గుడ్లు తేలేసేటట్లున్నాడు.'

నా మాటకు వాళ్ళు ఏమనుకున్నారో ఏమో వదిలేశారు.

దెబ్బలు తిన్న కుర్రాడు నా వంక కృతజ్ఞతగా చూశాడు.

'అన్నయ్యా!' అని పిలిచాడు నా బ్యాగు పట్టుకున్న అబ్బాయి.

అంటే వీరిద్దరూ అన్నదమ్ములన్నమాట.

'చూడు బాబు, నీ తమ్ముడు బతకడానికి కూలి చేస్తున్నాడు. నువ్వేమో పొట్టకోసం దొంగతనాన్ని ఎంచుకున్నావ్. దొంగగా పట్టుబడితే ఎంత హీనంగా ఉంటుందో గుర్తించావు కదా'

'చేతగానివాడు గనక వాడు కూలి చేస్తున్నాడు. రోజంతా కష్టపడ్డా ఇరవై రూపాయల కంటే ఎక్కువ సంపాదించలేడు. గురిచూసి బరువైన పర్సు ఒకటి కొట్టానో ఆరునెలలదాకా తిండికి కరువు ఉండదు' అన్నాడు తమ్ముడి వంక ఏవగింపుగా చూస్తూ.

'బ్రతకడం కోసం దొంగతనాలు చేయడం తప్ప నీకు జీవితంలో మరే ఆశా లేదా?' అడిగాను అతడి నైజాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ.

'ఎందుకు లేదు. నేను పెద్దవాడినయ్యాక గ్యాంగు లీడర్ని అవుతా. బాస్, బాస్ అంటూ అంతా నేను చెప్పినట్లు వింటారు. నేను ఏ పని చెబితే నా అనుచరులు ఆ పని చేస్తారు.

వాడి ఆశలకు, అభిరుచులకు ఆశ్చర్యమేసింది. నేటి తరం పిల్లల ధోరణిని చూస్తూ ఉంటే దేశం ఎటుపోతుందో ననిపిస్తోంది. వాళ్ళని అనుకుని ఏం లాభం? కనడమే తప్ప సక్రమంగా పెంచాలన్న ఇంగితజ్ఞానం లేని వారి తల్లిదండ్రుల్ని అనాలి.

మీ ఉపకారం మరచిపోలేనన్నట్లు కృతజ్ఞతగా చూసి వెళ్ళిపోయాడు ఆ అబ్బాయి.

బస్సెక్కి దిమిలిలో దిగి నలువైపులా చూశాను. ఊరంతా మారిపోయింది. కొత్తకొత్త ఇళ్ళు వెలిసాయి. రకరకాల దుకాణాలు తెరిచారు. ముందుగా సాంబయ్యని చూడాలనిపించి వాడి నివాస స్థలానికెళ్లాను. అక్కడ వాడి కమ్మరింటి స్థానంలో శ్లాబ్ బిల్డింగ్ కనిపించింది. వాడి పాక ఏవైంది? సాంబయ్య ఊరు విడిచి వెళ్లిపోలేదు కదా! ఆరా తీస్తే అతడు ఎలమంచిలి వెళ్ళిపోయినట్లు తెలిసింది. ఎందుకో మరి ఆ ఊళ్ళో ఉండబుద్ధి కాలేదు. తిరుగు బస్సులో ఎలమంచిలి వచ్చేశాను.

అప్పటికి సమయం సరిగ్గా మూడయింది. ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమైంది. చల్లని గాలి వీచడం ప్రారంభమయింది.

ఆ ఊళ్ళో అతికష్టం మీద సాంబయ్య ఇల్లు కనుక్కోగలిగాను.

వాకిట్లో నులకమంచం మీద పడుకున్న వృద్ధుడు నన్ను చూసి లేవబోయాడు.

అతడి చూపులు నన్ను గుర్తించినట్లు లేవు.

'నేను సాంబయ్యా చంద్రాన్ని. మేం దిమిలిలో ఉండేటప్పుడు నువ్వు మాకు పాలు పోసేవాడివి గుర్తుందా?'

నా మాటలకు అతడి నయనాలలో ఆనందరేఖలు వెల్లివిరిసాయి.

'నువ్వా చంద్రంబాబూ. ఈ అవిటోడిని సూడాలని వచ్చావా?' అన్నాడు చేతులు జోడిస్తూ.

అతడి పలుకుల్లో సంతోషంతోపాటు ఆర్ద్రత వ్యక్తమౌతుంది.

'ఏంటి సాంబయ్యా. నువ్వు... అవిటివోడివా?'

'ఔను బాబు ఏ జనమలో ఎవరికి అపకారం చేసానో తెలవదు. కాటికి కాలు సాసుకునే సమయంలో పక్షవాతం వచ్చేసినాది. లేచి నడవలేను' అన్నాడు. నేను ఆశ్చర్యం నుండి తేరుకోకముందే.

'పిల్లలేరి. సీతెక్కడ? ఇంతకు నువ్వావూరు విడిచి ఎందుకొచ్చేసావ్?' మనసులోని సందేహాలన్నీ ఒక్కమారే బయటపెట్టాను.

'ఏం సెప్పమంటారు బాబు. పసితనంలో సీతాలుకు పెళ్ళి చేసి నేను శానా పెద్ద తప్పు చేసేను. ఆ రోజు మీ మాట ఇనిఉంటే దానికింత వేగంగా భూమ్మీద నూకలు సెల్లిపోయిఉండేవి కావు' ఏవిటి సాంబయ్యా నువ్వంటున్నది? సీతాలుకు ఏమైంది?' 'సీతాలు సచ్చిపోనాది బాబు. కాదు నేనే సంపేసినాను'

సాంబయ్య కళ్ళు కుండపోతగా వర్షిస్తున్నాయి.

నా పెదవులు విడలేదు.

చెప్పుకుపోతున్నాడు సాంబయ్య.

'ముగ్గురు పిల్లలు పుట్టినాక ఆడికి నా కూతురంటే వెగటు పుట్టినాది. మరో వగలాడిని మనువాడి నా బిడ్డనొగ్గేసాడు. పసికూనలకి పెల్లిల్లు ఎందుకు చేయకూడదంటారో నాకప్పుడు తెలిసింది. ఏటినాబం? అంతా అయిపోనాది'

పశ్చాత్తాపం అతడి కళ్ళల్లో కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

'మరి పిల్లలు'

'వాళ్ళని నా సేతుల్తో కొంతకాలం పెంచి ఒగ్గేసాను. వాళ్ళేటి సేస్తున్నారో నాకు తెలవదు. అడిగినా సెప్పరు. నా మనవరాలు మాత్రం ఏ సంధ్య ఏలకో గూటికొచ్చి కాసింత గంజికాచి నా కడుపుమంట సల్లారుత్తోంది. కన్న కొడుకులు కనుమరుగైనా ఆ పిల్లే ఈ ముసలాడిని కంటికి రెప్పలా సూసుకుంటోంది'

అంతలో 'తాతా' అంటూ ముగ్గురు పిల్లలు లోపలికొచ్చారు.

నన్ను చూడడంతోనే 'బాబూ!' అన్నారంతా.

'ఎవర్రా ఈ బాబు మీకు తెలుసా?' అడిగాడు సాంబయ్య.

'ఈయాలే ఈ బాబుని బస్సులో సూసాను' మనవరాలి జవాబు.

'బుల్లోడు శానా మంచోడు' పెద్దవాడి సమాధానం.

'మనసున్న మడిసి' చిన్నోడి ప్రశంస.

ఆ పసివాళ్ళని చూస్తే నాకు జాలేసింది. ఒకడు దొంగగా, మరొకడు కూలివాడుగా, ఇంకోర్తి బిచ్చగత్తెగా మారడానికి సాంబయ్యే కారణం. అతణ్ణి నేను క్షమించలేను. నా మాట పెడచెవిని పెట్టి పసితనంలో సీతాలుకు పెళ్ళి చేసి దాని బ్రతుకు బుగ్గి చేశాడు. మానసికంగా ఎదగని పిల్లలకు పెళ్ళిళ్ళు చేస్తే ఫలితం ఎంత దారుణంగా ఉంటుందో చెప్పాలంటే సీతాలు జీవితమే నిదర్శనం.

పశ్చాత్తాపంతో దహించుకుపోతున్న సాంబయ్యకు ఇప్పుడు కావలసింది నా సానుభూతి కాదు. చేయూత. అది నేను ఏ రకంగా అందించగలను? కాస్సేపు మెదడుకు పని కల్పించాను.

'నేను మంచి వాడినని అడక్కుండానే మీరంతా సర్టిఫికెట్ ఇచ్చేశారు. చాలా సంతోషం. ఇంతకు మీరేం చేస్తున్నారో మీ తాతకి తెలీదు. తెలిస్తే గుండె పగిలి ఛస్తాడు. తల్లిదండ్రులకు కరువైన మీరు తాతకి కూడా దూరమై అనాధలుగా మిగులుతారు' అన్నాను పిల్లల్ని ముగ్గుర్నీ దగ్గరకు పిలిచి. నా మాటలకు వాళ్ళు స్పందించినట్టుంది.

'వద్దు మాకు తాత కావాలి. అతడు బ్రతికుండాలంటే మేం ఏం చేయాలో చెప్పండి' కోరస్‌గా అన్నారంతా.

'సరే మీరు అడిగారు గనక చెబుతున్నాను. మీరు చేస్తున్న పనులకు ఈనాటితో ఫుల్‌స్టాప్ పెట్టండి. మగపిల్లలైన మీరిరువురూ స్కూల్లో చేరండి'

'స్కూలా?' నోరెళ్ళబెట్టారు ఆ ఇద్దరబ్బాయిలు. 'ఔను. మీరు బడికెళ్ళి చదూకుంటారు. మిమ్మల్ని హాస్టల్లో చేర్పించే పూచీ నాది. మీకు కావలసిన పుస్తకాలు, భోజనం ప్రభుత్వమే ఇస్తుంది. మీ పనల్లా బాగా చదూకుని వృద్ధిలోకి రావటమే'.

'మరి చెల్లాయి' 'ఆ పిల్ల ఇంటిదగ్గరే ఉండి మీ తాతకి వండి పెడుతూ అతడి మంచిచెడ్డలు చూసుకుంటుంది'

'అందుకు డబ్బు?' అందామె.

'దానికి మార్గం చెబుతాను. జాగ్రత్తగా విను. నువ్వు, సాంబయ్య బట్టలకు రంగులు, అద్దకాలు వేస్తారు. దానికి అవసరమయ్యే సాంకేతిక పరిజ్ఞానాన్ని, సామగ్రిని నేనే సమకూర్చి పెడతాను. దాని మూలంగా మీకు నెలనెలా అంతో ఇంతో ఆదాయం లభిస్తుంది. ఒకరి దయాధర్మాల మీద ఆధారపడవలసిన పనుండదు. నువ్వు ఇంటి వద్దే చదూకోడానికి ప్రయత్నించు. ఆసక్తి ఉంటే చదువు తప్పకుండా వస్తుంది మన సమాజంలో ప్రతి స్త్రీ చదువుకుని తీరాలి. కేవలం ఉద్యోగం కోసమే కాదు. విజ్ఞానం కోసం అవసరమైతే ఏ పనికైనా సిద్ధంగా ఉండాలి. అసలు మనిషికి, మృగానికి తేడా చదువేనని ప్రతి ఒక్కడూ తెలుసుకోవాలి.

నా ప్లాను వాళ్ళకి నచ్చినట్లుంది. సరేనన్నారంతా.

సాంబయ్య కుటుంబానికి ఆర్థిక సహాయం చేయలేకపోయినా సరియైన మార్గాన్ని చూపించానన్న తృప్తి నాకు మిగిలింది. అన్నమాట ఆచరణలో పెట్టడానికి బయలుదేరాను.

అంత వరకు కమ్ముకున్న మేఘం ఒక్కసారిగా వర్షించింది.

**(8 నవంబరు 1998, ఆంధ్రభూమి డైలీ ఆదివారం అనుబంధం)**